నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, సోమవారం 25 నవంబర్ 2024 | YADADRI BHUVANAGIRI

యాదగిరి గుట్టలో భక్తుల సందడి

యాదగిరిగుట్ట, నవంబర్24 : యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. కార్తిక మాసం, ఆదివారం కావడంతో పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. సత్యనారాయణ వ్రతాల్లో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సారైనా రైతు భరోసా అందేనా..?

ఇంకా పత్తా లేని వానకాలం సీజన్ పైసల్

రైతు పెట్టుబడి సాయం రైతు భరోసా పత్తాలేదు. గత సీజన్ లోనే ఇవ్వకుండా పెండింగ్ లో పెట్టిన సర్కార్.. ఈ సీజన్లో నైనా ఇస్తుందా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే యాసంగి సాగు పనులు షురూ కాగా.. ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదు.

– యాదాద్రి భువనగిరి, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ)

యాసంగి సీజన్ యాక్షన్ ప్లాన్‌ను జిల్లా వ్యవసాయ అధికారులు సిద్ధం చేశారు. సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువుల ఇండెంట్‌ను రూపొందించారు. అధికారుల అంచనాల ప్రకారం అన్ని పంటలు కలుపుకొని 3,19,320 ఎకరాల్లో పంటలు వేయనున్నారు. ఇందులో 2.98 లక్షలు ఎకరాల్లో వరి, మిగతా పంటలన్నీ కలిపి 21,320 ఎకరాల్లో సాగు చేయనున్నారు. 74,500 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరమని లెక్కలు వేశారు. ఇక 57,816 టన్నుల ఎరువులు అవసరం కానున్నాయి. జిల్లాలో అనేక చోట్ల ఇప్పటికే సాగు పనులు షురూ అయ్యాయి. రైతులు దుక్కులు దున్నుతున్నారు. కూలీలను పిలిపించి నాట్లు వేయిస్తున్నారు.

యాదగిరిగుట్ట మండలం దాతరపల్లిలో ట్రాక్టర్‌తో నారుమడి దున్నుతున్న రైతు

పెంపు లేదు.. అసలు లేదు

కేసీఆర్ ప్రభుత్వం రైతుల కోసం రైతుబంధు పథకం తీసుకొచ్చింది. ఇందులో భాగంగా ఏటా రెండు సార్లు ఎకరాకు రూ. 5వేల చొప్పున పెట్టుబడి సాయం డబ్బులు బ్యాంక్ ఖాతాల్లో జమ చేసింది. ఎకరా నుంచి మొదలుకొని అర్హులు అందరికీ ఇచ్చింది. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏటా ఎకరాకు రూ. 15వేల సాయం చేస్తామని హామీ ఇచ్చింది. అంతేకాకుండా కౌలు రైతులకు కూడా వర్తింపజేస్తామని వాగ్దానం చేసింది. అది కూడా గతేడాది డిసెంబర్ 9వ తేదీన ఇస్తామని ప్రకటించింది. కానీ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సీజన్‌కు ఏటా రూ. 5వేలు జమ చేసినట్లే ఇచ్చింది. ఆ తర్వాత సీజన్‌లో పెంచి ఇస్తామన్న పెట్టుబడి దేవుడెరుగు.. గతంలో ఇచ్చినట్టు పాత పద్ధతి ప్రకారం కూడా డబ్బులు ఇవ్వకుండా పెండింగ్ లో పెట్టింది. సుమారు 2.70 లక్షల మందికి రూ. 300కోట్ల వరకు ఆపేసింది.

యాసంగిలో నైనా ఇచ్చేనా..?

గత సీజన్‌లో ఏవేవో సాకులు చెబుతూ పెట్టుబడి నిధులు విడుదల చేయలేదు. కొత్త నిబంధనలు రూపొందిందించాలని, అర్హులకే ఇవ్వాలని, అవకతవకలు అంటూ ముచ్చట్లు చెప్పింది. మంత్రి వర్గ ఉప సంఘం కమిటీ పేరుతో కాలయాపన చేస్తున్నది. కనీసం ఈ సీజన్‌లో అయినా వస్తాయా అనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఒక వేళ ఇచ్చినా ఎంత మందికి ఇస్తారు..? ఎంత మందికి కోత పెడుతారో అనే ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతున్నది. మరోవైపు చేతిలో పెట్టుబడి సాయం లేకపోవడంతో రైతులు వడ్డీలకు అప్పులు తెస్తున్నారు. బ్యాంకుల్లో ఇప్పటికే రుణాలు తీసుకోవడంతో చేసేదేంలేక బయటకు మిత్తీలకు తీసుకుంటున్నారు. ఇంకొందరు బ్యాంకుల్లో వ్యవసాయ రుణాలు తీసుకుని కాలం వెల్లదీస్తున్నారు.

2,33,461 లక్షల రైతుల ఖాతాల్లో..

ప్రపంచంలోనే మొదటి సారిగా రైతు బంధు పథకం తెలంగాణలో 2018 సంవత్సరంలో ప్రారంభించారు. రైతులకు ఏడాదికి ఎకరాకు రూ.10,000 చొప్పున 2023వరకు ఖాతాల్లో జమ చేశారు. బీఆర్ఎస్ హయాంలో 2,33,461 లక్షల రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.2,508 కోట్లను జమ చేశారు.

పెట్టుబడి సాయం పెంచి ఇవ్వాలి

గత సీజన్‌లో రైతు బంధు రాలేదు. ఈ సీజన్‌లో అయినా వస్తుందో రాదో. పెట్టుబడి సాయం పెంచి ఇస్తే బాగుంటుంది. దున్నకాలు అవుతున్నాయి నార్లు పోసింద్రు. పెట్టుబడి సాయం కావాలి. పనులు ప్రారంభమైనవి. డబ్బులు లేక చాలా ఇబ్బందులైతున్నయి . కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుబంధు పెంచి ఇస్తామంటే నమ్మినం. ఇంతవరకు రాకపాయె. ఎప్పుడిస్తారోనని ఎదురు చూస్తున్నాం . డబ్బులు ఇస్తే వ్యవసాయ పనులకు అవసరం వచ్చేది .

-కోట రామచంద్రారెడ్డి, రైతు, కనుముకుల గ్రామం, భూదాన్ పోచంపల్లి మండలం

కమిటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన

జిల్లాలో యాసంగి సాగు పనులు షురూ

పెట్టుబడి సాయం కోసం ఆశగా రైతుల ఎదురుచూపులు

బీఆర్ఎస్ హయాంలో రూ. 2,058 కోట్లు జమ

నేడు జిల్లా మీదుగా కేటీఆర్

- **కొత్తగూడెం, చౌటుప్పల్, చిట్యాల, నార్కట్‌పల్లి, అర్వపల్లి మీదుగా మహబూబాబాద్‌కు వెళ్లనున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్**
- **ఘన స్వాగతం పలుకనున్న మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ శ్రేణులు**

నల్లగొండ ప్రతినిధి, నవంబర్24(నమస్తే తెలంగాణ) : మహబూబాబాద్‌లో మహాధర్నాకు వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సోమవారం జిల్లా మీదుగా ప్రయాణించనున్నారు. హైదరాబాద్‌లో ఉదయం 7 గంటలకు బయలుదేరి 7:45 గంటల వరకు యాదాద్రి జిల్లా పరిధిలోని హైదరాబాద్ – విజయవాడ హైవే మీదుగా కొత్తగూడెం వద్ద ఉమ్మడి జిల్లాలోకి ప్రవేశిస్తారు. అక్కడ భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో యాదాద్రి జిల్లా నేతలు ఘన స్వాగతం పలుకనున్నారు. అక్కడ నుంచి ఉదయం 8:10 గంటలకు చౌటుప్పల్‌కు చేరుకుంటారు. అక్కడ మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో కేటీఆర్‌కు స్వాగతం పలుకనున్నారు. అనంతరం నకిరేకల్ నియోజకవర్గంలోని చిట్యాలకు 8:30 గంటలకు చేరుకుంటారు. అక్కడ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో స్వాగతం పలుకుతారు. తర్వాత 8:45 గంటలకు నార్కట్ పల్లి చేరుకొని నకిరేకల్ మీదుగా తుంగతుర్తి నియోజకవర్గంలోకి అడుగు పెడతారు. ఉదయం 9:30 గంటలకు అర్వపల్లిలో కేటీఆర్‌కు మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేశారు. తర్వాత జిల్లా దాటి ఉదయం 10:00 గంటలకు మరిపెడ బంగ్లా మీదుగా మహబూబాబాద్ చేరుకుంటారని పార్టీ వర్గాలు తెలిపాయి. కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు, పలువురు నేతలు కూడా ఉండనున్నారు.

చెస్‌లో గెలుపొందిన ఉమ్మడి జిల్లా విజేతలతో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

చదరంగం ఆటతో మేధాశక్తి పెంపొందుతుంది

- **చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు అభినందనీయం**
- **క్రీడాకారులు నైపుణ్యతను సాధించేందుకు పోటీలు దోహదం**
- **మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి**
- **ఉమ్మడి నల్లగొండ చెస్ విజేతలకు బహుమతి ప్రదానం**

సూర్యాపేట టౌన్, నవంబర్ 24 : శారీరక శ్రమ లేకుండా బ్రెయిన్ పవర్‌తో ఆడే ఆట చదరంగమని, ఈ ఆటతో మేధాశక్తి పెంపొందుతుందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు గండూరి కృపాకర్ ఆధ్వర్యంలో ఆదివారం సూర్యాపేట పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా ఓపెన్, అండర్ 11, 15 చదరంగ పోటీల్లో విజేతలకు ఆయన బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ చిన్ననాటి నుంచి చదరంగం ఆట అంటే తనకు మక్కువని, ఈ ఆటకు బ్రెయిన్ పవర్‌తోపాటు ఎంతో ఓపిక ఉండాలన్నారు. చెస్‌ను ప్రోత్సహించడంలో ప్రభుత్వాలకంటే అసోసియేషన్‌లు, ఎన్‌జీఓలు ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. క్రికెట్ కంటే ఎక్కువగా ఒకప్పుడు ప్రపంచ చెస్ పోటీలు జరుగుతుంటే ప్రజలంతా చెస్ చాంపియన్‌షిప్ ఎవరికి వస్తుందా అని ఆసక్తిగా ఎదురు చూసేవారని చెప్పారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచే కాకుండా సూర్యాపేట జిల్లా నుంచి కూడా ఎంతో మంది చెస్ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించారని తెలిపారు. జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించడం, తల్లిదండ్రులు తమ పిల్లలను క్రికెట్, సెల్‌ఫోన్ వైపు వెళ్లకుండా ప్రోత్సహించి పోటీలకు తీసుకురావడం అభినందనీయమని చెప్పారు. ఈ పోటీల్లో మెడల్స్ పొందని వారు వచ్చే పోటీల్లో బాగా ఆడి రాణించాలన్నారు. అనంతరం ఆయన ఓపెన్ కేటగిరీ, అండర్ 11, అండర్ 15పోటీల్లో విజేతలైన బాల బాలికలకు షీల్డులతో పాటు నగదు ప్రోత్సాహకం అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు చెరుకు సుధాకర్, గోపగాని వెంకటనారాయణగౌడ్, నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మారి పెద్ది శ్రీనివాస్‌గౌడ్, నెమ్మాది భిక్షం, మీలా వంశీ, జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గండూరి కృపాకర్, ఎల్.సతీశ్‌కుమార్, జాయింట్ సెక్రటరీ లింగారెడ్డి, ట్రెజరర్ వెంకటమురళి, ఆర్బిటర్స్ కరుణాకర్, విశ్వప్రసాద్, జానయ్య, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీలగిరి పాతబస్తీలో అరుదైన శివాలయం

నల్లగొండ పాత బస్తీ ఉమామహేశ్వరాలయంలో శివుడి పావనవట్టం



హనుమాన్ విగ్రహం

- **దేశంలో ఎక్కడాలేని విధంగా శివుడి పానవట్టం వద్ద హనుమాన్ విగ్రహం**
- **కందూరు చోడులు, కాకతీయ సామంత రాజుల కాలంలో నిర్మాణం**
- **నాటి చరిత్రకు సాక్ష్యం.. శిథిలావస్థకు చేరినా నేటికీ పూజలు**

రామగిరి, నవంబర్ 24 : నల్లగొండ అంటేనే చారిత్రాత్మక ప్రదేశంగా చెప్తుంటారు. ఇక్కడ ఎన్నో విశిష్టమైన ఆలయాలు ఉన్నాయి. పాతబస్తీలోని షేర్‌బంగ్లా సమీపంలో ఆర్యసమాజం(శిశుమందిర్) ఎదురుగా ఇండ్ల మధ్యలో అద్భుతమైన పురాతన శివాలయం ఉంది. దేశంలో ఎక్కడా లేని విధంగా శివుడి పానవట్టం వద్ద హనుమాన్ విగ్రహం ఉండటం ఇక్కడి విశిష్టతగా చెప్పవచ్చు. దీనిని హనుమాన్ సమేత ఉమా మహేశ్వరస్వామి దేవస్థానంగా పిలుస్తుంటారు. ఆలయంలో పెద్ద సాలగ్రామం ఉంది. ఆలయం వెలుపల అమ్మవారి విగ్రహం ఉంటుంది. కార్తిక మాసం కావడంతో నిత్యం ప్రత్యేక పూజలు సాగుతున్నాయి. నేడు కార్తిక చివరి సోమవారం సందర్భంగా పూజలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ ప్రాంతంలో ప్రజలు, భక్తులు తమకు తోచినంత నిధులు సమకూర్చి దేవస్థానం నిర్వహణ చేస్తున్నట్లు వెల్లడిస్తున్నారు. ఇక్కడ పూజలు చేస్తే అనుకున్నది నెరవేరుతుందని భక్తులు విశ్వసిస్తున్నారు.

ప్రాచుర్యంలోకి ఆలయం

నల్లగొండ పాతబస్తీలో ఓవైపు కాపురాల గుట్ట మరోవైపు బ్రహ్మంగారి గుట్ట ఉన్నాయి. షేర్‌బంగ్లా సమీపంలో కందూరు చోడులు, కాకతీయ సామంత రాజుల కాలంలో నిర్మించిన ఆలయం హనుమాన్ సమేత ఉమా మహేశ్వరస్వామి దేవస్థానం. అప్పటి సామంత రాజులు ఆలయంలో పూజలు చేశారని ఆ ప్రాంత వాసులు చెబుతున్నారు. ఈ శివాలయంలో చాలా కాలం ఘనమైన పూజలు జరిగాయని, మధ్యలో కొంత కాలం శిథిలావస్థకు చేరుకొని మళ్లీ ప్రాచుర్యంలోకి వచ్చిందని అంటున్నారు. ఇండ్ల మధ్యలో ఉండడం వల్ల ఈ ఆలయం బయటికి అంతగా కనిపించడం లేదు.ఆలయ ప్రాంగణంలో పెద్దబావి ఉండేది దానిని నుంచి ఆ ప్రాంతం వారు మంచినీటిని తీసుకెళ్లే వారని స్థానికులు చెబుతున్నారు. స్థల ప్రభావంతో దానిని పూడ్చివేశారు.

కోరికలు నెరవేరుతాయి

హనుమాన్ సమేత ఉమా మహేశ్వర దేవాలయం అద్భుతమైనది. ఇక్కడ మూడు, ఐదు వారాలు పూజలు చేస్తే దీర్ఘకాలిక భక్తుల కోరికలు నెరవేరుతాయి. ఈ ప్రాంతవాసులు, భక్తుల సహకారంతో దేవస్థాంలో నిత్యపూజలు, పండుగలు చేస్తున్నాం. ఇలాంటి పురాతన ఆలయాలను వెలుగులోకి తెచ్చి నాటి చరిత్రను నేటి తరానికి అందించేలా పునర్నిర్మాణం చేయాల్సిన అవసరం ఉంది.

- పర్వతం శివకుమార్, ఆలయ అర్చకుడు, నల్లగొండ

29న దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి

భువనగిరిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా కంచర్ల రామకృష్ణారెడ్డి

- **ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలి**
- **బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి**

భువనగిరి అర్బన్, నవంబర్ 24 : ఈ నెల 29న జిల్లా కేంద్రంలో నిర్వహించే దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. భువనగిరిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రమే లక్ష్యంగా ఉద్యమ నేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 2009 నవంబర్ 29న కరీంనగర్ నుంచి బయల్దేరి నిరాహార దీక్షలో పాల్గొన్నారని అన్నారు. ఈ క్రమంలో కేసీఆర్‌ను అరెస్టు చేసి ఖమ్మం జైల్లో పెట్టడం వల్ల ఆయన ఆరోగ్యం క్షీణించిందని, నిమ్స్ హాస్పిటల్‌లో చేర్పించినా ఆయన దీక్షను కొనసాగించి తెలంగాణ వ్యాప్తంగా ఉద్యమం ఉవ్వెత్తున ఎగసే విధంగా ప్రేరణ కల్పించారని తెలిపారు. నాడు డిసెంబర్ 9న కేంద్ర హోం శాఖమంత్రి చిదంబరం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రకటన చేయడంతో దీక్షను విరమించినట్లు చెప్పారు. కేసీఆర్ నాడు చేపట్టిన దీక్షలో భాగంగా శుక్రవారం భువనగిరి పట్టణ కేంద్రంలో నిర్వహించే దీక్షా దివస్‌లో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి హాజరుకానున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు ఏవీ కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు జనగాం పాండు, సుబ్బూరు బీరు మల్లయ్య, ర్యాకల శ్రీనివాస్, ఈర్ల కృష్ణ, సుభాశ్, నర్సిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దీక్షా దివస్ ఇన్‌చార్జిల నియామకం

నల్లగొండ ప్రతినిధి, నవంబర్24(నమస్తే తెలంగాణ) : ఈ నెల 29వ తేదీన పెద్దఎత్తున నిర్వహించనున్న దీక్షా దివస్‌కు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జిల్లాల వారీగా ఇన్‌చార్జిలను నియమించారు. నల్లగొండకు మహబూబ్‌నగర్ మాజీ ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి, సూర్యాపేట జిల్లాకు మాజీ జడ్పీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి, యాదాద్రి భువనగిరికి ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిని నియామకం చేశారు. వీరు నేడు, రేపు ఆయా జిల్లాలోని పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలతో దీక్షా దివస్ సన్నాహక సమావేశాలు నిర్వహించనున్నారు.

సర్వే వివరాలు సమర్ధవంతంగా చేపడుతున్నాం

- **కలెక్టర్ హనుమంతరావు**

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 24 : ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వేను సమర్ధవంతంగా చేపట్టడంతోపాటు సర్వే వివరాలను పారదర్శకంగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జార్ఖండ్ రాజధాని రాంచీ నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై జిల్లా కలెక్టర్లతో ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ కుటుంబ సర్వే చివరి దశకు చేరుకుంటుందని, సర్వే డేటా ఎంట్రీ చాలా కీలకమైందని, పొరపాట్లకు ఆస్కారం ఇవ్వవద్దని అన్నారు. డోర్ లాక్ చేసిన, వలస వెళ్లిన వారి వివరాలను ఫోన్ ద్వారా సేకరించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సేకరించిన సర్వే వివరాలను పక్కాగా ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు సరిపడా డేటా ఎంట్రీ ఆపరేటర్లను తీసుకున్నామన్నారు. జిల్లా, మండల స్థాయి అధికారుల పర్యవేక్షణలో సర్వే వివరాలు పక్కా గా నమోదయ్యేలా ఆదేశాలు ఇచ్చామని చెప్పా రు. స్కూళ్లు, హాస్టళ్లలో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశాలిచ్చామన్నారు. జిల్లాలో ఉన్న అన్ని హాస్టళ్లు, పాఠశాలల్లో విద్యతోపాటు మెనూ ప్రకారం పోషక విలువలతో కూడిన పౌష్టికాహారం అందేలా తగు జాగ్రత్తలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి

ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ శాస్త్రీయంగా చేపట్టాలి

- **పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి**
- **చౌటుప్పల్ వివిధ మండలాల బాధితులతో సమావేశం**

చౌటుప్పల్, నవంబర్ 24 : ఉత్తర భాగం ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ శాస్త్రీయంగా చేపట్టాలని పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని జీఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం వలిగొండ, చౌటుప్పల్, భువనగిరి, గజ్వేల్ తదితర ప్రాంతాల భూ నిర్వాసితుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మిగతా ప్రాంతాల్లో ఓఆర్ఆర్ నుంచి 40కిలోమీటర్లు తీసుకుంటున్నారని, ఇక్కడ 28 కిలోమీటర్లకే పరిమితం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం భూనిర్వాసితుల అభిప్రాయాలను తెలుసుకొని భూములు తీసుకోవాలని, లేకపోతే బాధితులతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. గత ఆరునెలల నుంచి తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదని ఆయన మండిపడ్డారు. ప్రస్తుతం ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని లేదా భూమికి బదులు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కానీ పక్షంలో బహిరంగ మార్కెట్ ధర చెల్లించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ చౌటుప్పల్ మండలాధ్యక్షుడు గిర్కటి నిరంజన్ గౌడ్, మాజీ జడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి, వివిధ సంఘాల నాయకులు బూర్గు కృష్ణారెడ్డి, ఢిల్లీ మాధవరెడ్డి, బండారు నర్సింహ, సందగళ్ల మల్లేశం గౌడ్, కేవీ వెంకటేశ్వర్లు, చిన్నం బాలరాజు, గోపగోని లక్ష్మణ్, బోరెం ప్రకాశ్ రెడ్డి, మారుపాక లింగం గౌడ్, జాల వెంకటేశం యాదవ్, జాల జంగయ్య యాదవ్, గుండెబోయిన వేణుయాదవ్ పాల్గొన్నారు.

సదర్ సమ్మేళనంలో దున్నపోతుల విన్యాసాలు

సంబురంగా సదర్ సమ్మేళనం

రామన్నపేట, నవంబర్24 : అఖిల భారత యాదవ మహాసభ మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం రామన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సదర్ సమ్మేళనాన్ని సంబురంగా నిర్వహించారు. యాదవులు బొడ్రాయికి బోనం సమర్పించి దున్నపోతుల ఊరేగింపు నిర్వహించి సమ్మేళనంలో విన్యాసాలు చేపట్టారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యే వీరేశం, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, క్యామ మల్లేశ్, దూదిమెట్ల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.